సాక్షి
వరంగల్

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



బ్యాడ్మింటన్‌లో భళా..
నర్సంపేటకు చెందిన వేదితరెడ్డి రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి నాలుగో స్థానంలో నిలిచింది. - 8లో ▸



వివాదాస్పదం - 8లో ▸
టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లు వివాదాస్పదమవుతున్నాయి. పరీక్షల్లో తప్పుడు రీడింగ్ చూపుతుండటంతో ఉద్యోగులు మండిపడుతున్నారు.

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.


సెల్‌కిల్ డ్రైవింగ్..!

ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరం

- కమిషనరేట్ పరిధిలో జరిమానాలు విధించినా మారని వైనం
- ఈ ఏడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 5,675
- బ్లూటూత్ అయినా తప్పని శిక్ష

వరంగల్ క్రైం:

చేతి భుజం, తలమధ్యలో సెల్‌ఫోన్ పెట్టుకుంటూ వాహనం నడపడం.. బ్లూటూత్‌లో మాట్లాడుతూ వెనుక హారన్ కొట్టినా పట్టించుకోకుండా అడ్డదిడ్డంగా పోవడం వాహనదారులకు అలవాటైపోయింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పోలీసులు నెత్తినోరు మొత్తుకుంటున్నా.. ఎడాపెడా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు మారడం లేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం సెల్‌ఫోన్ డ్రైవింగ్ అని తెలిసింది. దీంతో ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడాన్ని పోలీస్ అధికారులు డేంజర్ డ్రైవింగ్‌గా పరిగణిస్తున్నారు.



జరిమానాలు	
2023	రూ. 56,47,000
2024	రూ. 56,48,000

జరిమానాలు విధించినా..

ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో అడుగడుగునా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫోన్‌లో మాట్లాడుతూ వారి కంట పడితే జరిమానాలు విధిస్తున్నారు.

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటానికి హెల్మెట్ పక్కన పెట్టాలి.
- ఈ క్రమంలో డ్రైవింగ్ అదుపుతప్పి ప్రమాదాలకు కారణమవుతుంది.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల మెడనొప్పితో పాటు వెన్నెముక నొప్పి వస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.
- ఏదైనా అర్జంట్ మాట్లాడాల్సి వస్తే వాహనం పక్కకు ఆపి మాట్లాడి ఆ తరువాత వెళ్లాలి.
- సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1,000, దీంతోపాటు హెల్మెట్ వాడనందుకు రూ.135 జరిమానా.


బాధ్యతారాహిత్యమే..



వాహనదారుల్లో చాలామంది బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. కొందరు బ్లూటూత్ వాడుతూ వాహనాలు నడుపుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. మీ వల్ల ఇతర వాహనదారులు చిక్కుల్లో పడతారు. మరీ అర్జంట్ అయితే వాహనం పక్కన ఆపి మాట్లాడి వెళ్లొచ్చు. అంతేగానీ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

- సత్యనారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, వరంగల్ పోలీస్ కమిషనరేట్

అనర్హత.. తప్పదా..?



ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవికి పొంచి ఉన్న ముప్పు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత.. నాలుగు వారాల గడువు
- చర్చనీయాంశంగా మారిన హైకోర్టు తీర్పు
- స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక అనివార్యమేనా?
- కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, వరంగల్ :

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవికి అనర్హత ముప్పు పొంచి ఉందా..? ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పదా.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై తెలంగాణ హైకోర్టు సోమవారం ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి జిల్లాలో ఇదే చర్చ నడుస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ధర్మాసనం స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. సుమోటోగా కేసు స్వీకరించి మళ్లీ విచారణ ప్రారంభిస్తామని తీర్పులో హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

అంతటా 'అనర్హత'పైనే చర్చ...

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు అనంతరం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానందగౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా మరో పిటిషన్ వేశారు. సుప్రీం కోర్టు తీర్పుతో పాటు పలు రాష్ట్రాల్లోని న్యాయస్థానాల తీర్పులను, ఫిరాయింపు చట్టం నిబంధనలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరకు పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని సోమవారం హైకోర్టు ఆదేశించించడం కలకలం రేపింది. దీంతో స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ పొందడం మొదలు గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరడం... తాజాగా హైకోర్టు తీర్పు వెలువడే వరకు పలుమార్లు కడియం శ్రీహరి పతాకశీర్షికలకెక్కారు. హైకోర్టు తీర్పు మేరకు కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడే అవకాశమే ఎక్కువుందన్న చర్చ ఒక పక్కన.. స్పీకర్ కార్యాలయం ఏం నిర్ణయం తీసుకుంటుందోనన్న చర్చ మరో పక్కన జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పదా? అన్న ఉత్కంఠ బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల్లో నెలకొంది.

విమర్శలు, ప్రతి విమర్శలు..
ఎవరి ధీమా వారిదే...

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటుకు సంబంధించిన అంశంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు స్పందించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, డా.టి.రాజయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు ఎవరికీ వారుగా తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు.

వెంటనే చర్య తీసుకోవాలి..

బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న. నాలుగు వారాల్లో ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు స్పీకర్ అనర్హత వేటు వేయాలి.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

డివిజన్ బెంచ్ అప్పీలుకు వెళ్తాం

నాకు కోర్టుపైన నమ్మకం ఉంది.. డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్తాం. పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నేతలే పార్టీ ఫిరాయింపులకు మూల కారకులు. 2014 నుంచి 2023 మధ్యకాలంలో పెద్ద ఎత్తున ఫిరాయింపులకు పాల్పడిన చరిత్ర బీఆర్ఎస్‌ది.

- కడియం శ్రీహరి, ఎమ్మెల్యే


నిబద్ధత ఉంటే శ్రీహరి రాజీనామా చేసి గెలవాలి..

బీఆర్ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి నిబద్ధత ఉంటే రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై గెలవాలి. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. రాజకీయ పార్టీలకు అతీతంగా, రాజ్యాంగబద్ధంగా స్పీకర్ వ్యవహరించాలి. కడియం శ్రీహరి, కావ్యలు నియోజకవర్గానికి ఎంత చేసిన తక్కువే. నియోజకవర్గ ప్రజలకు వారు రుణపడి ఉండాలి.

- డాక్టర్.టి.రాజయ్య, మాజీ డిప్యూటీ సీఎం

బీఆర్ఎస్‌కు జిల్లా అధ్యక్షుడేడి?

- అరూరి రమేశ్ బీజేపీలో చేరికతో ఆరు నెలల క్రితం ఖాళీ
- ఇంకోవైపు వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేక నైరాశ్యం
- అధికార పార్టీని ఎదుర్కొనేందుకు వీటి భర్తీ అవసరం
- జిల్లా పార్టీ కార్యాలయం ఉండాలంటున్న పార్టీ శ్రేణులు



సాక్షి, వరంగల్: భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీని ముందుండి నడిపించే జిల్లా అధ్యక్షుడు లేక ఆ పార్టీ నీరసించిపోతోంది. అరూరి రమేశ్ బీజేపీలో చేరికతో ఆరు నెలల క్రితం ఖాళీ ఏర్పడిన అధ్యక్ష పదవికి ఇప్పటికీ ఎవరిని నియమించకపోవడంతో పార్టీ శ్రేణుల్లోనూ నిరాసక్తత కనిపిస్తోంది. జిల్లా బీఆర్ఎస్ పార్టీకి జిల్లా కార్యాలయం లేకపోవడంతో ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్‌లతో పాటు ఇతర ముఖ్యనేతలు అధికార పార్టీ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడేందుకు హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే మీడియా సమావేశాలకు రావాల్సిన పరిస్థితి ఉంది. రైతు రుణమాఫీతో పాటు కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి మాట్లాడేందుకు హనుమకొండ జిల్లా వేదిక కావడంపై వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతల్లోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టి సారించి వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌కు అధ్యక్షుడిని నియమించడంతో పాటు జిల్లా పార్టీ కార్యాలయం ఉండేలా చొరవ చూపాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. తెలంగాణ ఉద్యమానికి గడ్డ అయిన వరంగల్ జిల్లాకు బీఆర్ఎస్ పార్టీని నడిపించే నాయకుడు లేరంటే ప్రజల్లోకి వ్యతిరేక సంకేతాలు వెళ్తున్నాయంటూ మొర పెట్టుకుంటున్నారు. త్వరలోనే పంచాయతీ ఎన్నికలు ఉండే అవకాశమున్న నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడంతో పాటు మంచి ఫలితాలు రాబట్టేందుకు ఈ అధ్యక్ష నియామకం అవసరమని గులాబీ పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

వర్ధన్నపేటకూ లేని నాయకత్వం..

జిల్లాలోని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నర్సంపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలు చురుగ్గా ఉన్నారు. వారి నియోజకవర్గంలోని సమస్యలపై కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయినా చాలా మంది బీఆర్ఎస్ నేతలు కొందరు ఆ పార్టీకి బైబై చెప్పి కాంగ్రెస్‌లోకి వెళుతున్నారు. ఇంకోవైపు వర్ధన్నపేట నియోజకవర్గానికి కూడా నాయకత్వ లేమి ఉంది. ఇక్కడి నుంచి అరూరి రమేశ్ బీజేపీలో చేరారు. కీలకంగా ఉన్న మరో నేత మార్నేని రవీందర్‌రావు కాంగ్రెస్‌లో చేరారు. ఇలా ముఖ్యనేతలు ఇతర పార్టీలోకి వెళ్లడంతో ఈ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను ముందుండి నడిపించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గులాబీ పార్టీ ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇలా జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవీ ఖాళీగా ఉండడంతో ఎవరైనా ముఖ్యనేతలను సాధ్యమైనంత తొందరగా ప్రకటించాలని శ్రేణులంటున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే ఈ కీలక పదవులు భర్తీ కావాలని, అప్పుడే సమన్వయంతో మంచి ఫలితాలు వస్తాయంటున్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ప్రజావాణి వాయిదా

వరంగల్: హైదరాబాద్ మహాత్మా జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో నేడు (మంగళవారం) జరిగే రాష్ట్రస్థాయి ప్రజావాణి కార్యక్రమం వాయిదా వేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు జరుగుతున్నందున మంగళవారం రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా పడిందని, ఈమార్పును వరంగల్ జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

వరంగల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్‌తో పాటు పైతరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి జె.హైమావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఫ్రెష్, రెన్యూవల్ దరఖాస్తులు డిసెంబర్ 31వ తేదీలోగా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. తెలంగాణఈపాస్.సీజీజీ.జీటీవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలి సూచించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



వరంగల్ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న(శనివారం) లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.వి నిర్మలా గీతాంబ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్ భవన్‌లో సోమవారం ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్, బ్యాంకు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో గీతాంబ పాల్గొని మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, వివాహ/కుటుంబ, మోటర్ వెహికల్ యాక్ట్, బ్యాంకు, చిట్‌ఫండ్, ఎక్సైజ్, ఇతర కేసులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.రమేష్, చిట్‌ఫండ్ మేనేజర్లు, బీమా కంపెనీల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కేడీసీలో అతిథి అధ్యాపకుల నియామకం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ ఆర్‌ట 01, బీసీఏ కంప్యూటర్స్ - 01, ఎలక్ట్రానిక్స్ - 01, గణితం - 01, మైక్రోబయాలజీ - 01 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. యూజీసీ నిబంధనల మేరకు పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులు, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు కేడీసీలో దరఖాస్తు చేసుకోవాలని, 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

అధ్యాపకులు సాంకేతికతను పెంపొందించుకోవాలి



నర్సంపేట రూరల్: అధ్యాపకులు సాంకేతికతను పెంపొందించుకోవాలని ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ అటల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆరురోజుల పాటు ది ఫ్యూచర్ ఆఫ్ ఎలక్ట్రికల్ వెహికిల్స్, టెక్నాలజీ చాలెంజెస్, అపర్చునిటీస్ అనే అంశంపై అధ్యాపకులకు సాంకేతిక శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణం సమతూల్యానికి ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఎంతో అవసరమన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ హరిహరన్, నిర్వాహకులు డాక్టర్ ఎస్.మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ ఆర్. శరవణన్, సింగం శ్రీధర్, ఏఓ సురేష్, డీన్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాళోజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ సత్యశారద

వరంగల్: ప్రజాకవి పద్మవిభూషన్ కాళోజీ నారాయణరావు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని విగ్రహానికి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ×పుట్టుక నీది, చావు నీది.. బతుకు అంతా సమాజానిదిఅని కాళోజీ నారాయణరావు మాటలను గుర్తు చేశారు. ఒక్క వ్యక్తి మంచి చెడులను గుర్తించేది వారి పనులే అని చెప్పిన మాటలు మన విధి నిర్వహణకు చాలా దగ్గరగా ఉంటాయన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, మాట్లాడుతూ కాళోజీ తెలుగుభాషకు చేసిన సేవలు మరువలేనివని, తెలుగు భాష సంస్కృతిని పెంపొందించుటకు చేసిన కృషి ఫలితంగా వారి జయంతిని తెలుగు భాష దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యదేవి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఉమారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కాళోజీ విగ్రహంపై పూలు చల్లుతున్న కలెక్టర్ సత్యశారద

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నర్సంపేట: నర్సంపేట జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అభినవ్, ఏడవ తరగతి చదువుతున్న ఉదయశ్రీలు హనుమకొండలో ఆదివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఖోఖో బాల బాలికల ఎంపిక పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు అభినవ్, ఉదయశ్రీలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా బాయ్స్ హైస్కూల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొర్ర సారయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన ఉదయశ్రీ, అభినవ్, శిక్షణ ఇచ్చిన కోట రాంబాబును నోడల్ ఆఫీసర్ కొర్ర సారయ్య అభినందించి రాష్ట్ర స్థాయికి వెళ్లడానికి అయ్యే ఖర్చులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.రమేష్, జి.శ్రీనివాస్, అబిద తబస్సుమ్, డి.రమేష్, ఎం.రమేష్, ఎస్.ఉమామహేశ్వర్, పి.రవికుమార్, గోపాల్‌రావు, బిక్షపతి, బుచ్చిరాములు, బాల, శైలజ, వీరస్వామి పాల్గొన్నారు.

బిల్లు రాలేదని గ్రామ పంచాయతీకి తాళం



జీపీ భవనానికి తాళం వేస్తున్న తిరుపతిరెడ్డి

దుగ్గొండి: గ్రామ పంచాయతీకి నూతన భవనం నిర్మించి రెండేళ్లు దాటినా బిల్లు రాలేదని ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లుతున్నానని తాజా మాజీ సర్పంచ్ కార్యాలయ భవనానికి తాళం వేసిన ఘటన మండలంలోని తొగర్రాయిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామ పంచాయతీ భవనాన్ని తాజా మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి రెండు సంవత్సరాల క్రితం రూ. 20 లక్షలతో నిర్మించారు. అధికారులు రూ.18.80 లక్షలకు బిల్లు చేశారు. బిల్లు చేసి రెండేళ్లు దాటినా.. రావడం లేదని, అప్పు చేసి భవనం నిర్మించానని, ఇప్పటికే రూ. 5.60 లక్షల వడ్డీ చెల్లించానని తిరుపతిరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు బిల్లు రాకపోవడంతోనే అధికారులను కార్యాలయంలోకి వెళ్లకుండా తాళం వేసినట్లు తాజా మాజీ సర్పంచ్ తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చేసిన పనులవి కూడా రూ.8 లక్షలు రావాల్సిఉందన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు గ్రామానికి చేరుకుని తిరుపతిరెడ్డికి నచ్చజెప్పారు. పీఆర్ ఈఈ ఇజ్జగిరి, ఎంపీడీఓ అరుందతి, ఎంపీఓ శ్రీధర్, ఏపీఓ శ్రీనివాస్‌లు బిల్లు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అందే విధంగా కృషి చేస్తామని తాళం తీయించారు.

ఐటీఐలో అప్రెంటిస్ మేళా

కాజీపేట : ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను ఐటీఐ అభ్యర్థులు ఉద్యోగాల కోసం సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ రీజియన్ అధికారి సీతారాములు తెలిపారు. కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో పీఎం జాతీయ అప్రెంటిస్ మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- గ్రీవెన్స్‌లో 80 దరఖాస్తులు

వరంగల్: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డిలు ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత, కుటుంబ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించేలా ఉండాలని సూచించారు. వచ్చిన 80 దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖ 34, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 17, మిగతావి వివిధ శాఖలకు సంబంధించినవి వచ్చాయన్నారు. వచ్చిన అర్జీలు ఆయా శాఖల అధికాలకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

జీవన భృతి ఇవ్వడం లేదు..



మూడున్నరేళ్లుగా జీవన భృతి ఇవ్వకుండా నా కుమారుడు కరుణాకర్ ఇంటి నుంచి తరిమేశాడు. రూ.6 కోట్ల విలువైన ఆస్తులు ఇచ్చాము. భర్త చనిపోయిన తర్వాత పోషించక పోవడంతో కోర్టు నెలకు రూ.3వేలు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. జూన్ 2021 వరకు బ్యాంకులో జమ చేసి అప్పటి నుంచి వేయడం లేదు. పలుమార్లు అడిగితే కొడుకు, కోడలు తిట్టి దాడి చేసి తరిమేశారు. అప్పటి నుండి పెద్ద కూతురు వద్ద ఉంటును. నా కొడుకుకు ఇచ్చిన ఆస్తిని నాపేర రిజిస్ట్రేషన్ చేయించి న్యాయం చేయాలి.

- బుద్దెలక్ష్మి, వృద్ధురాలు, ఆరెపల్లి

ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములకు రుణం ఇప్పించాలి



మా దత్తత బ్యాంక్ (ఏడీబీ ఎస్‌బీఐ, నర్సంపేట) అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులకు రుణాలు ఇవ్వొద్దని లీడ్ బ్యాంక్ మేనేజర్ నుంచి సమాచారం వచ్చిందంటున్నారు. రుణాల కోసం దరఖాస్తులు పెట్టి 3 నెలలయ్యింది. బ్యాంక్ అధికారులు ల్యాండ్ లోకేషన్ ఫొటో, పంట రకం విచారణ పూర్తి చేశారు. ఇంతకు ముందు కొంత మంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులకు రుణాలు ఇచ్చారు. ఐటీడీఏ నుంచి ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతుల ఆన్‌లైన్ లిస్టును బ్యాంకు పంపారు. లిస్ట్ ప్రకారం వ్యవసాయ రుణాలు ఇప్పించాలి.

- ముత్యాలమ్మ తండా రైతులు

క్లుప్తంగా

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


స్వాతి(ఫైల్)

వరంగల్: వరంగల్ మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన రావిరాకుల స్వాతి.. అత్తింటి వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వాతికి అదే గ్రామానికి చెందిన రావిరాకుల నిరంజన్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. పెళ్లయిన తర్వాత నుంచి భర్త, అత్త.. అధిక కట్నం కోసం స్వాతి వేధింపులకు గురిచేసేవారు. ఈక్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించినా భర్త నిరంజన్ వేధించడం మానక పోవడంతో ఈనెల 5వ తేదీ సాయంత్రం స్వాతి గడ్డి మందు తాగి తన తల్లికి చెప్పింది. వారు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ స్వాతి సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి తలకోట్ల యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాఘవేందర్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి..


రాజబాబు మృతదేహం

జఫర్‌గఢ్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని కూనూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కూనూర్‌కు చెందిన శంకపల్లి రాజబాబు (45) కార్పెంటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడి భార్యతో తరచూ గొడవ పడేవాడు. రెండు రోజుల క్రితం భార్యభర్తల మధ్య చిన్న తగాదా రావడంతో మనస్తాపానికి గురైన రాజబాబు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోవడంతోపాటు మృతదేహానికి సోమవారం పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. కాగా రాజబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

వివాదాస్పదం

తప్పుడు రీడింగ్ చూపుతున్న బ్రీత్ అనలైజర్

- వరంగల్–2 డిపోలో నిత్యకృత్యంగా మారిన వైనం
- సోమవారం ఇద్దరు డ్రైవర్లకు అధిక రీడింగ్
- పోలీసు స్టేషన్‌లో చెక్‌చేస్తే జీరో..
- ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో బ్రీత్ అనలైజర్ టెస్టులు వివాదస్పదమవుతున్నాయి. ప్రధానంగా వరంగల్–2 డిపోలో వారానికి ఒకసారి బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వస్తున్న తప్పుడు రీడింగ్‌తో ఉద్యోగులనుంచి ఓ వైపు నిరసనతోపాటు, మరో వైపు ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం అలవాటు లేనివారికి ఎక్కువ రీడింగ్ చూపించడంతో బ్రీత్ అనలైజర్ టెస్టులపై ఉద్యోగులు మండిపడుతున్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–2 డిపోలో మద్యం సేవించని ఇద్దరు డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా నిర్ణీత మోతాదును మించి రీడింగ్ వచ్చింది. ఎం.రాజుకు 66, సాంబరాజుకు 44 రీడింగ్ వచ్చింది. వీరు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి పరీక్షించుకోగా ఇద్దరికీ జీరో వచ్చింది. సాధారణంగా 20లోపు రీడింగ్ ఉంటే పరిగణలోకి తీసుకోరు. 20 దాటిన వారిపై యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. అంతకు ముందు ఈ నెల 1న కూడా ఇద్దరు డ్రైవర్లు ఎండీ యాకూబ్, నరేందర్‌కు ఇదే మాదిరిగా అధిక రీడింగ్ రావడంతో ఆ రోజు ఆర్టీసీ ఉద్యోగులు వరంగల్–2 డిపోలో గేట్ ధర్నాలు చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి పరీక్షించగా జీరో రీడింగ్ వచ్చింది. అంతకు ముందు మరో డ్రైవర్‌కు ఇదే విధంగా అధిక రీడింగ్ రాగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా జీరో వచ్చింది. అయినా తప్పుడు రీడింగ్ చూపిస్తున్న బ్రీత్ అనలైజర్ విషయంలో ఆర్టీసీ డిపో, రీజినల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి వివాదస్పదమైంది. గతంలో పరకాల డిపోలో మద్యం అలవాటులేని డ్రైవర్‌కు పరీక్షించగా 200 రీడింగ్ వచ్చింది. వెంటనే ఉద్యోగులు ఆందోళనకు దిగి బస్సులు నిలిపివేశారు. అప్పటి పరకాల డిపో మేనేజర్ తాను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించుకోగా డ్రైవర్ రీడింగ్ కంటే అధికంగా వచ్చింది. దీంతో అప్పుడు డిపో మేనేజర్ ఆ డ్రైవర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వరంగల్–2 డిపోలో అదే పరిస్థితి తలెత్తె అవకాశముంది. తరచూ అధిక రీడింగ్ చూపిస్తూ ఉద్యోగాలు ఊడకొడుతుండడంతో డ్రైవర్లతోపాటు, మద్దతుగా కండక్టర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో అధిక రీడింగ్ వచ్చిన వారిని సస్పెండ్, రిమూవల్ చేస్తుండడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చిన్ననాటి నుంచి మద్యం అలవాటు లేని వారికి సైతం మద్యం సేవించినట్లు రీడింగ్ చూపిస్తూ జీవితాలతో చెలగాటమాడుతున్న బ్రీత్ అనలైజర్లను మార్చాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ముమ్ముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే బస్సులు నిలిపివేసి ఆందోళనకు దిగేందుకు డ్రైవర్లు, కండక్టర్లు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా, రైల్వేలో ఒక బ్రీత్ అనలైజర్‌లో తప్పుడు రీడింగ్ వస్తే, ఆ ఉద్యోగి కోరిక మేరకు మరో బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తారని, ఇక్కడ కూడా మద్యం సేవించలేదని స్పష్టమైన హామీతో తనను మెడికల్ టెస్టుకు పంపించాలని కోరితే పంపిస్తారని, ఆర్టీసీలోనూ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ సంస్థ నిబంధనలు, ఆదేశాల మేరకు నడుచుకుంటామని, స్వంతంగా నిర్ణయాలు తీసుకోలేమని చెప్పడం కొసమెరుపు.



వరంగల్–2 డిపోలో తప్పుడు రీడింగ్ చూపించే బ్రీత్ అనలైజర్

బిల్ట్‌లో బాంబుల మోత


బాంబులు పేల్చడంతో కూలిపోతున్న భవనం

మంగపేట: తెలంగాణకు తలమానికంగా నిలిచి భారీ పరిశ్రమగా పదేళ్ల క్రితం వరకు ఒక వెలుగు వెలిగిన కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ భవనాలు బాంబులతో కూల్చివేస్తుండటంతో ఫ్యాక్టరీలో ఉద్యోగం, ఉపాధి పొందిన కార్మికులు ఆవేదన చెందుతున్నారు. 2014లో బిల్ట్ ఫ్యాక్టరీ మూతపడిన విషయం తెలిసిందే. మూతపడిన కర్మాగారంలో స్క్రాబ్ తొలగించే పనులు ఆరు నెలల క్రితం నుంచి కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఫ్యాక్టరీలో వివిధ విభాగాలకు చెందిన భవనాలు, చిమ్నీలను భారీ పొక్లెన్లతో కూల్చివేశారు. ఫ్యాక్టరీలోని మరో భారీ చిమ్నీ, ఫిటింగ్ విభాగానికి చెందిన భారీ భవంతిని సోమవారం బాంబులతో పేల్చి కూల్చివేశారు. ఫ్యాక్టరీ స్క్రాప్ తొలిగింపు పనులు పూర్తి చేయాలనే గడువు మరో రెండు నెలలు మాత్రమే ఉండటంతో కాంట్రాక్టు పనులు పొందిన సంస్థ పనుల్లో వేగం పెంచింది. సోమవారం బాంబుల మోతతో కమలాపురం భారీ శబ్దాలతో దద్దరిల్లింది. ఒకప్పుడు ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు షిఫ్టుల వారీగా విధుల నుంచి బయటకు వచ్చే సమయం, ఫ్యాక్టరీలోకి విధులకు వెళ్లే సమయంలో సైరన్ మోగించే వారు అలాంటి సందర్భం నుంచి నేడు కూల్చివేత కోసం ఫాక్టరీలో బాంబులు పేలుతుంటే అందులో ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి పొందిన కార్మికులు బరువెక్కిన హృదయంతో చూస్తూ ఉండిపోయారు. కమలాపురానికి పూర్వ వైభవం వస్తుందో రాదో స్పష్టమైన సమాచారం నేటికి ప్రశ్నార్థకమే. గడిచిన పదేళ్ల కాలంలో బిల్టు ఫ్యాక్టరీ భవితవ్యం, ఫ్యాక్టరీనే నమ్ముకున్న కార్మికుల సమస్య పలు రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో ఒక పావుగా మారిందే తప్ప ఒరిగిందేమీ లేదని కార్మికులు, స్థానిక ప్రజలు ఆయా రాజకీయ పార్టీల నాయకుల తీరుపై మండిపడుతున్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ

- దేశ్‌ముఖ్‌లకు ముచ్చెమటలు పట్టించిన సాహసి
- నేడు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి


చాకలి ఐలమ్మ(ఫైల్)

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ విప్లవోద్యమంలో చిట్యాల(చాకలి) ఐలమ్మ పాత్ర వీరోచితమైనది. ఆమె జీవితం ఇప్పటికీ అనేక పోరాటాలకు ప్రేరణగా నిలుస్తోంది. భూమి కోసం, భుక్తి కోసం, పేద బతుకుల విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో ఆమె ఓ అగ్నికణం. విస్నూరుదొర రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలపై పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ. తన పంటపొలాల్లో పండించిన ధాన్యం విషయంలో ప్రారంభించిన ఉద్యమం యావత్ తెలంగాణ జిల్లాలకు వ్యాపించింది. రాంచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఎర్రజెండాను చేతపట్టి ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. 'ఐలమ్మ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నం' గా నిలిచిందని పుచ్చలపల్లి సుందరయ్య కొనియాడారు. 1895 సెప్టెంబర్ 26న రాయపర్తి మండలం కిష్టాపురంలో జన్మించిన ఐలమ్మ 1985 సెప్టెంబర్ 10న కన్నుమూసింది. ఆమె పోరాటానికి చిహ్నంగా మండల కేంద్రంలో స్మారక స్థూపం, భవనం నిర్మించి కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. కాగా, ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. నేడు ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించనున్నారు.

కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి


నివాళులర్పిస్తున్న వరుణ్ రెడ్డి

హన్మకొండ: ప్రజా హక్కుల కోసం పరితపించి పోరాడడమే తన ఊపిరిగా భావించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన గొప్పవ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, కె.కిషన్, రవీంద్రనాథ్, అశోక్, బీకంసింగ్, జీ.ఎంలు మాధవరావు, మల్లికార్జున్, దేవేందర్, నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, కంపెనీ సెక్రటరీ వెంకటేశం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఖాయం

- మూడు చోట్ల బీఆర్ఎస్ గెలవబోతోంది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి.. మూడు నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురబోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు విషయమై సోమవా రం కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోర్టును ఆశ్రయించగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ న్యాయమూర్తులు స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. గడువులోపు ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోని పక్షంలో తామే తీసుకుంటామని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. కొద్ది రోజుల్లో తెలంగాణలో మూడుచోట్ల ఉప ఎన్నికలు రానున్నాయని, బీఆర్ఎస్ విజయం ఖాయమని అన్నారు. కోర్టు తీర్పును గౌరవించి ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఫిరాయింపులపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎంపీ వినోద్ కుమార్


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ కుమార్

హన్మకొండ: పార్టీ ఫిరాయింపులు, పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా నడుచుకునే ఎంపీలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు కనీస కాలవ్యవధి నాలుగు వారాలుగా నిర్ణయిస్తూ రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో సవరణ చేయాలని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపుల చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో పార్టీ వ్యతిరేక చర్యలు, ఫిరాయింపులకు పాల్పడిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు నిర్ణీత కాలవ్యవధి లేకపోవడంతో స్పీకర్లు జాప్యం చేయడానికి అవకాశముందన్నారు. ఫిరాయింపుల చట్టానికి సంబంధించిన 6వ షెడ్యూల్‌లో చర్యలకు నిర్ణీత కాలవ్యవధి చేర్చాలనే అంశాన్ని ప్రధాని మోదీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిర్ణీత కాలవ్యవధి నిర్ణయిస్తూ సవరణకు చొరవ తీసుకోవాలన్నారు. లేకపోతే ప్రజాప్రతినిధులపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని, ఆ లోపు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే తామే సుమోటగా విచారణకు స్వీకరిస్తామని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ స్పీకర్ కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు విని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోర్టుతో చీవాట్లు తినొద్దన్నారు.

జేసీఎల్‌గా రాజేంద్రప్రసాద్ బాధ్యతల స్వీకరణ


రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్యాంసుందర్

హన్మకొండ చౌరస్తా : వరంగల్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జేసీఎల్)గా రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన సునీత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. రాజేంద్రప్రసాద్‌ను హనుమకొండలోని కార్యాలయంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికశాఖ సిబ్బంది జేసీఎల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■7 నం॥ ఉచిత విద్య+ హాస్టల్ గల CBSE కేంద్ర ప్రభుత్వ నవోదయ స్కూల్స్ కోచింగ్ 30-10-2024 ప్రారంభం నం॥ కాశిబుగ్గ, భారతీయ ప్లే స్కూల్. సెల్: 8801066232, 8985100150. [W-1239976]

SERVICES

■వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును, సిబిల్ అవసరం లేదు, NPA కూడా, దరఖాస్తు, హన్మకొండ ✆ 8790379618. [WA-6522]

FINANCE

■హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

CHANGE OF NAME

■I, the undersigned ASMA FARHEEN, W/o. MOHAMMAD ZUBER of my minor daughter name as SAFURA (as per my daughter passport bearing no. S9245259) have changed my daughter name to SAFURA SHANAYA (as per my daughter Date of Birth Certificate and Aadhar Card) R/o. H.No. 3-1-260, Kakatiya Colony, Hanumakonda, Warangal-506001, Telangana, India, and solemnly declare. [W-1239975]

■I, the undersigned ASMA FARHEEN, W/o. MOHAMMAD ZUBER, of my minor son name as MOHAMMAD ASADUDDIN (as per my son passport bearing no. S6477229) have changed my son name to MOHAMMAD ASADUDDIN ADIY (as per my son Date of Birth Certificate and Aadhar Card) R/o. H.No. 3-1-260, Kakatiya Colony, Hanumakonda, Warangal-506001, Telangana, India, and solemnly declare. [W-1239974]

■I, the undersigned VEDAVATHI VINEELA (New Name) previously called VEERA VINEELA VEDAVATHI (Old Name), R/o. H.No.2-9-1038/2, Waddepally, Hanumakonda City & Dist- 506370, Telangana State, India, and solemnly declare. [W-1239779]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7988242391 [SCA-24000238]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■Wanted Female Telecallers for SBI Credit Card Sales Department in Bhupalpally Area Give Good Salary Contact: 9963490087. [WA-6523]

■మా ఆఫీస్‌లో పనిచేయుటకు Telecallers, Management, Receptionist, Marketing Supervisor స్త్రీ, పురుషులు కావలెను. Cell: 7382106287. [W-1239972]

■అపాంట్‌మెంట్స్ షాపింగ్ మాల్స్, ఆఫీస్‌లో గల పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, ఆయాలు అర్జెంటుగా స్త్రీలు, పురుషులు కావలెను. సెల్: 7382323126. [W-1239973]

■మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/- ఫోన్: 70756 56208. [V-6557]

■ త్రినేత్రహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph : 8520874499, 8520980099 [H-796274]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాడ్మింటన్‌లో భళా..

- రాష్ట్రస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిన వేదిత


తల్లిదండ్రులతో వేదితరెడ్డి

నర్సంపేట: ఒకప్పుడు అమ్మాయిలను చదువుకు మాత్రమే పరిమితం చేసే తల్లిదండ్రులు ప్రస్తుతం క్రీడల్లో కూడా శిక్షణ ఇప్పిస్తూ దేశానికి మెరుగైన క్రీడాకారులను అందిస్తున్నారు. ఇటీవల పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజి వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన అథ్లెట్ కావడం గొప్ప కీర్తిని తెచ్చింది. తాజాగా నర్సంపేటకు చెందిన కట్కూరి వేదితరెడ్డి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి.. ఈనెల 4నుంచి 6వరకు నల్గొండ జిల్లాలో జరిగిన అండర్–11 సింగిల్ కేటగిరిలో నాలుగో స్థానంలో నిలిచి మెడల్ సాధించింది. యానిక్స్ సన్‌రైజ్ మూడో తెలంగాణ రాష్ట్ర మినీ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన వేదితరెడ్డి నాలుగవ స్థానంలో నిలిచి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహం..

నర్సంపేటకు చెందిన కట్కూరి సురేశ్‌రెడ్డి–మమత దంపతులు హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు వేదితరెడ్డి, నిధితరెడ్డి ఉన్నారు. తమ కుమార్తెలను చదువుతోపాటు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో బ్యాడ్మింటన్‌లో ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నారు. కుమార్తెలు ఇద్దరూ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరుస్తూ పలు మెడల్స్ పొందేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నల్గొండలో జరిగిన పోటీలో పెద్ద కుమార్తె వేదిత రెడ్డి వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి నాలుగో స్థానంలో నిలిచి మెడల్స్ సాధించింది. చిన్న కుమార్తె నిధితరెడ్డి సైతం గతంలో బ్యాడ్మింటన్‌లో జిల్లా స్థాయి మెడల్స్ సాధించింది. తమ ఇద్దరు కుమార్తెలను ఇండియా తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొనేలా కృషి చేస్తున్నట్లు తల్లిదండ్రులు సురేశ్‌రెడ్డి–మమత తెలిపారు.

అడవి విధ్వంసంపై శాస్త్రీయ అధ్యయనం


అడవిని పరిశీలిస్తున్న బృందం

ధర్మసాగర్: మేడారం, తాడ్వాయి ప్రాంతంలో అడవి విధ్వంసం గురించి జన విజ్ఞాన వేదిక, పర్యావరణ సబ్ కమిటీ బృందం శాస్త్రీయ నిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు సబ్ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడారం దారి గుండా కొండేటి వాగు నుంచి కొండపర్తి గ్రామం వరకు ఆగస్టు 31న సాయంత్రం దట్టమైన మేఘాలతోపాటు గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీచిన సమాంతర ఉధృత గాలుల వల్ల సుమారు 100 నుంచి 150 హెక్టార్లలో 60 వేలకు పైగా వృక్షాలు నేలకొరిగాయని తెలిపారు. గాలి వాన దాటికి చెట్లు కూకటి వేళ్లతో నేలకొరిగాయని పేర్కొన్నారు. సన్నగా ఉన్న చెట్లు సగానికి విరిగి తెగిపడ్డాయని 100 సెంటీమీటర్ల చుట్టుకొలత గల పెద్ద వృక్షాలు మాత్రం బరువు ఎక్కువై నేలకొరిగాయనేది శాస్త్రీయ అంచనా అని పేర్కొన్నారు. ఈ ప్రాంతమంతా ఇసుక నేలలు కావడం, నాలుగు అడుగుల కింద రాతి గుండ్లు ఉండడంతో వేరు వ్యవస్థ సమాంతరంగా వ్యాపించిందని, తల్లి వేరు కొద్దిలోతు వరకే పెరగడం మరో కారణమని తెలిపారు. ఈ ప్రాంతంలో కేంద్ర వాతావరణ శాఖ తమ పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పి ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను ముందే అంచనా వేసి ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ అటవీ శాఖ పడిపోయిన చెట్లను లెక్కిస్తూ సత్వర సంరక్షణ చర్యలు చేపట్టాలని జన విజ్ఞాన వేదిక, పర్యావరణ బృందం అభిప్రాయపడింది. అడవిని పరిశీలించిన వారిలో పురుషోత్తం, ధర్మప్రకాశ్, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, సాజిద్ ఉన్నారు.

మహిళ మృతికి ఆర్‌ఎంపీ వైద్యమే కారణం

- తేల్చి చెప్పిన వైద్యాధికారులు
- అనాథలుగా మారిన చిన్నారులు


లావణ్య(ఫైల్)


మహిళకు వైద్యం అందించిన ఆర్‌ఎంపీకి నోటీసులు జారీ చేస్తున్న వైద్యాధికారులు


అనాథలుగా మారిన చిన్నారులు

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన పోలవేని లావణ్య(34) అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యున్ని సంప్రదించగా అర్హతకు మించి వైద్యం అందించడంతో మహిళ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గత ఏడాది తండ్రి పోలవేని రవి గుండెపోటుతో మరణించగా ప్రస్తుతం తల్లి లావణ్య మృతితో వారి ఇద్దరు కుమారులు అనాథలయ్యారు. లావణ్య విషజ్వరంతో మృతి చెందిన విషయం ప్రచారం కావడంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అల్లెం అప్పయ్య, డాక్టర్ రణధీర్, ప్రోగ్రాం ఆఫీసర్, రాయినిగూడెం పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్, ఏఎన్‌ఎం తిరుమల విచారణ చేపట్టి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. లావణ్యకు రెండు రోజుల క్రితం ఛాతినొప్పి రావడంతో ఆర్‌ఎంపీని సంప్రదించగా ఈసీజీ చేయించకుండా గ్లూకోజ్‌లు, అధిక మోతాదులో యాంటిబయాటిక్స్ అందించాడని తెలిపారు. ఈ మేరకు వైద్య బృందం సదరు క్లినిక్‌ను తనిఖీలు చేపట్టగా సదరు ఆర్‌ఎంపీకి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని గుర్తించి నోటీసులు జారీ చేశామని తెలిపారు. లావణ్య విషజ్వరంతో మృతి చెందలేదని గుండె నొప్పితో మృతి చెందిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ప్రజలు అనారోగ్యం బారినపడితే ప్రభుత్వ దవాఖాల్లో చికిత్స పొందాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు.

మెదడులో గడ్డకట్టిన రక్తం

- వైద్యం చేయించుకోలేని స్థితిలో గీత కార్మికుడు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

కన్నీటి గాథ


హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న

కురవి: మానుకోట జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు కత్తి వెంకన్న 20 రోజుల క్రితం చేను వద్దకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాకపోవడంతో భార్య సుజాత.. భర్త కోసం చేను వద్దకు వెళ్లగా.. అచేతనస్థితిలో పడిఉన్నాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. మెదడులో రక్తం గడ్డకట్టిందని, ఆరోగ్యశ్రీలో రూ.2లక్షల వరకే వైద్యం అందుతుందని వైద్యులు తెలిపారు. అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రోజుకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుంది. ఈక్రమంలో చేతిలో ఉన్న డబ్బంతా అయిపోవడంతో ఆ కుటుంబం అయోమయంలో పడింది. మెదడులో రక్తం గడ్డకట్టి పక్షవాతంతో(చేతులు, కాళ్లు చచ్చుపడిపోయాయి) ఇబ్బందిపడుతున్న వెంకన్న కోలుకోవాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. ఇప్పటికే తమవద్ద ఉన్న డబ్బు ఖర్చయిపోవడతో వెంకన్న కుటుంబసభ్యులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు సాయం అందించాలని వేడుకుంటున్నారు.

గూగుల్ పే నంబర్ 91105 97061
ప్రవీణ్(వెంకన్న కుమారుడు)

వేదవిద్యార్థులకు ఇంగ్లిష్ విద్య అవసరం


మాట్లాడుతున్న డీసీ శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : వేద విద్యార్థులకు వేదవిద్యతోపాటుగా ఇంగ్లిష్ విద్య కూడా అవసరమని వరంగల్ దేవాదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు అన్నారు. సోమవారం వరంగల్ దేవాదాయ ధర్మాదాయశాఖ భవనంలో ఉన్న శ్రీభద్రకాళి సాంగ అగమ వేదపాఠశాల విద్యార్థులకు దాత విజయకుమార్, జానకి దంపతుల సౌజన్యంతో ఇంగ్లిష్ బోధించేందుకు ఉపాధ్యాయురాలిని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు మాట్లాడుతూ వేదవిద్యార్థులు ఇతరదేశాల్లో పనిచేయాల్సి వచ్చినపుడు ఇబ్బంది పడకుండా వారికి ఆంగ్లవిద్య తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయురాలిని నియమించినట్లు తెలిపారు. అలాగే కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వేదవిద్యార్థులతో ఇంగ్లిష్ మాట్లాడించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, భద్రకాళి దేవాలయం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి


సుజాత (ఫైల్)

మంగపేట : ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం అంబేడ్కర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వంకాయల వెంకటేశ్ భార్య సుజాత(32) డెంగీ జ్వరంతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. 20 రోజుల క్రితం సుజాత డెంగీ జ్వరంతోపాటు మలేరియా, టైఫాయిడ్ జ్వరం కారణంగా లివర్ వాపు, పసికల వ్యాధితో తీవ్ర అనారోగ్యం పాలైంది. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంలో చేర్పించారు. ఈక్రమంలో ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.